

తెలంగాణ

ప్రతి వార్త సంచలనం

పాఠకులకు, ప్రకటన కర్తలకు,

శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు.



నేడు దీపావళి
పండుగ సందర్భంగా పత్రిక
కార్యాలయానికి సెలవు.
సోమవారం పత్రిక వెలువడదు.
పునఃదర్శనం మంగళవారం

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 274 ఆదివారం 8 నవంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదన్న ట్రంప్

గత ఐదు నెలలుగా ఎవరూ చనిపోలేదని వెల్లడి

ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌ను తానే కాపాడానని వ్యాఖ్య

ఇరాన్ అణు కార్యక్రమం శాంతియుతమేనని టెహ్రాన్ స్పష్టీకరణ



2

ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ పై అమెరికా నిఘా వర్గాల సంచలన నివేదిక

చైనా గూఢచారిగా అనుమానిస్తున్న మహిళతో ఆయనకు ప్రేమ సంబంధం ఉన్నట్లు ఆరోపణ

అధునాతన ఏఐ చిప్‌లను చైనాకు తరలించేందుకే ఈ యత్నమని అనుమానం

ఆరోపణలను ఖండించిన ఎన్విడియా, చైనా.. నిరాధారమని వెల్లడి



2

సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్

- ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం
- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ
- రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. – మిగతా2లో



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు



దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. – మిగతా2లో

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ

ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ



2

డిండికి నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదు: కవిత



ఏదుల నుంచి డిండికి నీళ్లు తీసుకురావడం అసాధ్యమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి నీళ్లను తీసుకువస్తేనే నల్లగొండ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులు చేపడితే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డ్యామేజ్ అయ్యిందని చెప్పుకొచ్చారు. – మిగతా2లో



2

కూకట్‌పల్లి ఫ్లాట్ల పై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం

101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం

14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ

కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు

వరి ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు



వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి, నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోలను ఏర్పాటుకు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో మంచి ధర వచ్చేవరకు రైతులు ఆ ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

– మిగతా2లో

సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్

ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు.

వరి ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో మంచి ధర వచ్చేవరకు రైతులు ఆ ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు అంశాలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సైలోల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలని కోరారు. దాన్యాన్ని పెద్ద మొత్తంలో నిల్వ చేయగల భారీ ఉక్కు గిడ్డంగులే సైలోలు. ప్రతిపాదిత సైలోల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం వంతెనలు, తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాల ఏర్పాటు చేస్తారు. ధాన్యంలోని మట్టి, చెత్త వంటి మలినాలను యంత్రాలతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు. ఆరబెట్టిన ధాన్యాన్ని యంత్రాలతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెడదను తప్పించేందుకు ఏర్పాట్లను చేస్తారు. సైలోల నిర్మాణానికి రెండు నమూనాలను పరిశీలిస్తున్నారు. మొదటి విధానంలో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేస్తుంది. రెండో విధానంలో తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించే సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు సంస్థలను సైలోలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. ఈ విధానంలో ప్రైవేటు సంస్థలకు గిట్టుబాటు అయ్యేలా నిర్ణీత కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

కోడంగల్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును శనివారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఎండగట్టారు. సదరు ఎత్తిపోతల పథకానికి రేవంత్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తే.. మంత్రి పొంగులేటికి చెందిన కంపెనీ అందులో పాల్గొందని విమర్శించారు. ఈ టెండర్లలో పాల్గొన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపై ఉన్న నామమాత్రపు సంస్థలని తెలిపారు. చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిందని వివరించారు. వ్యయం ఇంత భారీగా పెరగడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వివరించారు. ఈ ప్రాజెక్టు వ్యయం ఐదు రెట్లు పెరిగిందని సోదాహరణగా చెప్పారు. ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా ప్రజలకు అందలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ప్రభుత్వంపై అగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో పారదర్శకతకు తావు లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఓ వైపు తెలంగాణలో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులపై నిప్పులు చెరిగారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రభుత్వంలోని నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని ఆయనకు స్పష్టం చేశారు.

డిండికి నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదు: కవిత

ఏదుల నుంచి డిండికి నీళ్లు తీసుకురావడం అసాధ్యమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి నీళ్లను తీసుకువస్తేనే నల్లగొండ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులు చేపడితే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డ్యామేజ్ అయ్యిందని చెప్పుకొచ్చారు. ఇక, మహబూబ్ నగర్‌కు నీళ్లు ఇవ్వడానికే చాలా సమయం పడుతుందని, నల్లగొండకు నీళ్లు రావడం సాధ్యం కాదని తెలిపారు. శనివారం డిండి రిజర్వాయర్‌ను కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత మాట్లాడుతూ.. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఉల్పర, శివన్నగూడెంకు నేరుగా గోదావరి నీళ్లు ఇవ్వవచ్చని చెప్పారు. తాము తీసుకొచ్చిన ప్రతిపాదన ఎలాంటిదో, ఎంత ఉపయోగకరమైనదో ఈ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలుసుకోవాలని అన్నారు. అవసరమైతే ఇంజినీర్లతో తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల సొరంగంలో కార్మికులు మృతిచెందారని ఆరోపించారు. గత ప్రభుత్వం టన్నెల్‌ను కొంత నిర్లక్ష్యం చేసిందని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నట్లు కవిత చెప్పుకొచ్చారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానం తుపాకులగూడెం వద్దే జరగాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేసుగుర్రం అనుకుంటే కీలు గుర్రం అయ్యిందని, సీఎం రేవంత్ చెప్పిందే మళ్లీ మళ్లీ చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని, బీఆర్ఎస్ నిద్రమత్తును వదిలించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలని కవిత కోరారు. మరోవైపు, పంటలు వేయొద్దంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమి ఇస్తుందో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ పై అమెరికా నిఘా వర్గాల సంచలన నివేదిక

ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ చుట్టూ తీవ్ర వివాదం ముసురుకుంటోంది. చైనా కోసం గూఢచర్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక మహిళతో ఆయనకు ప్రేమ సంబంధం ఉందని అమెరికా నిఘా వర్గాలు రూపొందించిన ఒక మెమో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నివేదిక ఆధారంగా 'ఫైనాన్షియల్ టైమ్స్' ప్రచురించిన కథనంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ పరిణామం అమెరికా టెక్, రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఏడాది ప్రారంభంలో కొద్దిమంది ఉన్నతాధికారుల మధ్య ఒక రహస్య మెమో సర్క్యులేట్ అయింది. అందులో ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్‌కు, చైనాకు చెందిన వ్యాపారవేత్త అలిస్ హువాంగ్ (హువాంగ్ లే)తో సంబంధాలున్నట్లు పేర్కొన్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేసే మెగాస్పీడ్ అనే డేటా సెంటర్ సంస్థలో ఆమె ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ సంస్థ ఎన్విడియాకు కస్టమర్‌గా ఉంది. అయితే, అలిస్ హువాంగ్‌ను చైనా ప్రధాన గూఢచర్య సంస్థ 'మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ' తమ ఏజెంట్‌గా నియమించుకుందని అమెరికా అధికారులు అనుమాని స్తున్నారు. అధునాతన ఎన్విడియా ఏఐ చిప్‌లను అమెరికా ఆంక్షలను దాటి చైనాకు అక్రమంగా తరలించేందుకు అలిస్ హువాంగ్ ప్రయత్నిస్తున్నారని, ఈ క్రమంలోనే ఆమె జెన్సెన్ హువాంగ్‌తో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకున్నారని గతంలో న్యూయార్క్ టైమ్స్ సైతం ఒక కథనాన్ని ప్రచురించింది. తాజా నిఘా నివేదిక ఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య శిఖరాగ్ర సదస్సుకు కొద్ది రోజుల ముందు ఈ మెమోను అధికారులు పంచుకున్నట్లు సమాచారం.

ఆరోపణలను ఖండించిన ఎన్విడియా, చైనా

అయితే, ఈ ఆరోపణలను ఎన్విడియా సంస్థ తీవ్రంగా ఖండించింది. తమ సీఈఓ జెన్సెన్ హువాంగ్ ప్రతి ఏటా వేలాది మంది కస్టమర్ ఎగ్జిక్యూటివ్‌ల ను కలుస్తుంటారని, అందులో భాగంగానే మెగాస్పీడ్ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారని తెలిపింది. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. గతంలో చిప్‌ల తరలింపునకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే అంతర్గత విచారణ జరిపి, అవి నిరాధారమని తేల్చినట్లు గుర్తుచేసింది. మరోవైపు,ఎచైనా విదేశాంగ శాఖ కూడా ఈ వార్తలను కొట్టిపారేసింది. బీజింగ్ పై బురద జల్లేందుకే ఇటువంటి నిరాధారమైన ఊహాగానాలను ప్రచారం చేస్తున్నారని మండిపడింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు

దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడం లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదన్న ట్రంప్

ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణను 'యుద్ధం'గా పరిగణించలేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో వాషింగ్టన్ గణనీయమైన పురోగతి సాధించిందని, ఘర్షణకు ముందు కంటే ఇప్పుడే తాము ఎక్కువ చమురును పొందుతున్నామని పేర్కొన్నారు. "గత ఐదు నెలలుగా ఈ ఘర్షణలో ఎవరూ గాయపడలేదు, చనిపోలేదు. అలాంటప్పుడు దీన్ని యుద్ధం అని ఎలా అంటారు? ఇది యుద్ధం కాదు" అని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల భవిష్యత్ కార్యాచరణపై అనిశ్చితి కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికీ సైనిక ప్రత్యామ్నాయాలపై చర్చిస్తున్నప్పటికీ, ఇది యుద్ధం కాదని ఆయన నొక్కి చెప్పడం గమనార్హం. మరోవైపు, ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారకుండా తాను అడ్డుకోకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ సహా మొత్తం పశ్చిమాసియా ఉనికిలో ఉండేది కాదని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ అణు ఆశయాలను అడ్డుకోవడంలో తన పాత్ర అందరికీ తెలిసినా, ఎవరూ బహిరంగంగా అంగీకరించరని ఆయన పేర్కొన్నారు. "నేను ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా ఆపకపోతే ఇజ్రాయెల్, వాస్తవానికి మొత్తం పశ్చిమాసియా ఈరోజు ఉండేది కాదు. ఈ నిజాన్ని ఎవరూ చెప్పరు, కానీ అందరికీ తెలుసు!" అని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు. ఇరాన్ అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకుండా నిరోధించడమే లక్ష్యంగా 2025, 2026 సంవత్సరాల్లో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై భారీ దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమానికి ఎంత నష్టం వాటిల్లిందనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. అక్టోబర్‌లో వెలువడిన కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక ప్రకారం.. ఈ దాడులు ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఎంతవరకు ప్రభావితం చేశాయో చెప్పడం కష్టమని పేర్కొంది. అంతేకాకుండా గతంలో చేసిన అంచనాల ప్రకారం, ఇరాన్ అసలు అణ్వస్త్రాలను నిర్మించడం లేదని కూడా ఆ నివేదిక గుర్తు చేసింది. మరోవైపు, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని, అణ్వస్త్రాలను అభివృద్ధి చేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది.

కూకట్‌పల్లి ఫ్లాట్ల పై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టు లో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

సంపాదకీయం

నెల్లూరును అతలాకుతలం చేసిన పెద గాలివాన



గాలివాన ఒక ప్రకృతి వైపరీత్యం. ఒక భయంకరమైన అనుభవం. వందేళ్ల క్రితం సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని రోజుల్లో రేడియో వార్తలే ఆధారం. వార్తల్లో తుఫాను అని చెపితే గుండెల్లో గుబులు. సరిగ్గా వందేళ్ల నాటి నెల్లూరు పెద గాలివాన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ కథలు కథలుగా చెబుతూనే ఉంటారు.నవంబరు ఒకటి, 1927న నెల్లూరును తుఫాను కాటేసింది. అక్టోబరు 30వ తేదీ బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడింది. ఇది తుఫానుగా మారి నవంబరు 1, 2 తేదీల్లో నెల్లూరు వద్ద తీరం దాటింది. 12గంటల పాటు నెల్లూరును వణికించింది. ఒకటో తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైన తుఫాను రెండో తేదీ అర్ధరాత్రి ఒంటిగంట వరకు బలమైన ప్రభావం చూపింది. 25 మైళ్ల రేడియస్‌తో కోవూరు నుంచి గూడూరు డివిజన్ వరకు ప్రతాపాన్ని చూపింది. కడప జిల్లా వరకు ఈ ప్రభావం ఉన్నప్పటికీ నెల్లూరు జిల్లా మాత్రం పూర్తిగా అతలాకుతల మైంది. ఒకటో తేదీన జిల్లా యంత్రాంగం సైతం నిర్వేదంలో ఉండిపోయింది. ఏమి జరుగుతుందో కూడా చూడలేని భయానక స్థితి. అధికారులు సైతం బయటకు రాలేని ప్రచండ తుఫాను అది. ఆ విధ్వంసం రోజున నెల్లూరు పట్టణంలో వేల ఇళ్ల కిటికీలు, ద్వారబంధాలు గాలికి ఊడి పడిపోయాయి. రెండో తేదీన అధికారులు బయటకు వచ్చి చూసేటప్పటికి నెల్లూరు స్వరూపమే మారిపోయింది. వందలాది చెట్లు పడిపోయాయి. రోడ్లు, వీధులు కూలిన చెట్లతో నిండి ఉన్నాయి. పెంకుటిళ్లు పడిపోయాయి. ముత్తుకూరు, కోవూరు, గూడూరు తాలూకా ఆఫీసు, పబ్లిక్ భవనాలు నిట్టనిలువుగా కూలిపోయాయి. కలెక్టర్ ఇంటి భవనం, ప్రభుత్వ ఆస్పత్రి భవనాలు కూలిపోయాయి. కలెక్టర్ కార్యాలయ కాంపౌండులో మర్రిచెట్లు వేళ్లతో సహా నేలకూలింది. టౌను హాలు, జూబ్లీ హాస్పిటల్ బాగా దెబ్బతిన్నాయి. అప్పటికే పక్కాభవనాలు నిర్మించుకున్న చర్చిలు, ప్రైవేటు ఆస్పత్రులు, మిషన్ స్కూలు భవనాలు కూలిపోయాయి. మునిసిపాలిటీ వాటర్ వర్క్స్, ఆయిలుతో ఏర్పాటుచేసిన పట్టణంలోని వీధి దీపస్తంభాలు, వాషింగ్టన్ లైట్స్ కూడా దెబ్బతిని చాలాకాలం నెల్లూరును అంధకారంలో ఉంచాయి. పెద్ద పడుగుపాడు వద్ద గూడ్సురైలు పడిపోయింది.పెన్నా వరదల వల్ల ఉత్తర, దక్షిణాలకు సంబంధాలు తెగిపోయాయి. టెలిగ్రాఫ్ వ్యవస్థ ధ్వంసమైంది. మా మిడి, కొబ్బరి, తాటిచెట్లు లక్షల్లో పడిపోయాయి. దీంతో కొంతకాలం వరకు ఇంటిని కప్పుకొనేందుకు తాటి ఆకులు కూడా దొరకని పరిస్థితి. పశువులు, కోళ్లు, మేకలు కూడా వందలాదిగా చనిపోయి పల్లెలు దుర్గంధపు కేంద్రాలయ్యాయి. ఈ గాలివానకు 629 మంది చనిపో యినట్లు అధికారులు ధృవీకరించారు. ఇందులో 378మంది నెల్లూరు తాలూకాలో, నెల్లూరు పట్టణంలో 22మంది, కోవూరు తాలూకాలో 113మంది మృతిచెందారు. భవనాలు, పైకప్పులు, జింక్ షీట్లు కూలటం నెల్లూరులో ప్రమాదాలకు కారణం అయింది. మరికొం తమంది గాలికి కొట్టుకుపోతూ మృతిచెందారు. ఇంకొందరి అచూకీ లేదు. 50,324 పశువులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కోవూరు, రావూరు, నెల్లూరు తాలూకాలలో ఈ ఘటనలు ఎక్కువగా నమోద య్యాయి. పశువులు, మనుషులు మృతిచెందటం, మృతదేహాలు కుళ్లిపోవటం, పారిశుధ్యానికి సిబ్బంది కూడా లేని భయానక పరిస్థితిలో కలరా వ్యాపించింది. నెల్లూరులో 1880 మందికి కలరా సోకి, 876మంది మృత్యువాత పడ్డారు. కోవూరు తాలూకాలో 700 మందికి కలరా సోకి అందులో 190మంది మృతి చెందారు. గాలివాన తర్వాత కూడా పదిరోజుల పాటు వర్షాలు పడుతూనే ఉండటం జిల్లాకు శాప మైంది. నష్టాన్ని చూసేందుకు మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి రెవెన్యూ అధికారి హెచ్.జి. స్టోక్స్ నెల్లూరొచ్చారు. మద్రాసు గవర్నరు లార్డ్ గోషన్ జిల్లాలో పర్యటించి 20వేల రూపాయలను తుఫాను బాధితుల సహాయార్థం అందజేశారు. కలరా బాధితులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ముత్తుకూరు, సర్వేపల్లి, కొడవలూరు, ఫిర్యాలలో రామకృష్ణ మిషన్ అమోఘమైన సేవలు అందించింది. బియ్యం, బట్టలు మాత్రమే కాక, ఇళ్లు కూడా ఈ సంస్థ నిర్మించింది. జాలర్లకు పడవలు చేయించింది. చిన్న ఉద్యోగులకు వంద రూపా యలు వడ్డీలేకుండా రుణం ఇచ్చింది. గాలివాన, కలరా వల్ల చాలా మంది పిల్లలు అనాథలయ్యారు. ఆరు అనాథాశ్రమాలు కూడా వీరి కోసం ఏర్పాటు చేశారు. గాలివాన వచ్చిన ఐదురోజుల తర్వాత కూడా పెన్నాకు వరదలు వస్తున్నాయనే భయాందోళన పట్టణంలో నెలకొంది. ఇళ్లు, గూళ్లు వదిలేసి ప్రజలంతా ఎత్తు ప్రాంతంలో ఉన్న (ప్రస్తుతం దర్గామిట్ట) జిల్లా కలెక్టర్, ఎస్.పి బంగళాలకు చేరుకున్నారు. అధికారులు విచారించి, ఇది కేవలం పుకారు అని, ఎద్దుల బండ్లు ఏర్పాటుచేసి ప్రజలను ఇళ్లకు పంపారు.

ప్రెస్ స్టిక్కర్‌పై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధా?

-జర్నలిస్టుల గుర్తింపు ముఖ్యం..

-మరే వారి జీవన భద్రత పట్టదా?

తెలంగాణ ప్రభుత్వానికి జర్నలిస్టులంటే గుర్తింపు కార్డులు, అక్రిడిటేషన్లు, వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లు మాత్రమే గుర్తుకొస్తున్నాయా?

జర్నలిస్టుల హక్కులు, వారి కుటుంబాల జీవన భద్రత, మీడియా సంస్థల్లో వారికి అందాల్సిన కనీస వేతనాల గురించి మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదు?

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వాహనాలపై 'ప్రెస్' అనే పదాన్ని, ప్రెస్ లోగోలను వినియోగించుకునే విషయంలో కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులే తమ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లు ఉపయోగించాలని స్పష్టం చేసింది. నకిలీ జర్నలిస్టుల పేరుతో జరుగుతున్న దుర్వినియోగాన్ని అరికట్టాలనే ఉద్దేశం మంచిదే. వృత్తి గౌరవాన్ని కాపాడటానికి నిబంధనలు ఉండాల్సిందే. అయితే ఈ నిబంధనల అమలులో సమానత్వం, నిష్పాక్షికత కూడా ఉండాలి కదా!

-మరి మిగతా నిబంధనల విషయంలో ఈ కఠినత్వం ఎక్కడికి పోతోంది?

ప్రెస్ స్టిక్కర్ల విషయంలోనే ప్రభుత్వ యంత్రాంగం ఇంత వేగంగా స్పందిస్తుంటే, వాహనాలపై అనధికారికంగా వాడుతున్న వీఐపీ గుర్తులు, అధికార హోదాను సూచించే లోగోలు, అనుమతి లేని సైరన్లు, మోతాదుకు మించిన శబ్దంతో మోగించే హారన్ల విషయంలోనూ ఇదే స్థాయిలో చర్యలు ఎందుకు కనిపించడం లేదు? ట్రాఫిక్ నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలి కదా! చట్టం ముందు జర్నలిస్టు ఒకరే కాదు, అధికారం ఉన్నవారు కూడా సమానమే కదా!

ప్రభుత్వం గుర్తింపు విషయంలో ఒక వర్గానికి నిబంధనలు విధిస్తే, అదే రహదారిపై తిరిగే ఇతర వాహనాల విషయంలోనూ చట్టాన్ని సమానంగా అమలు చేయాలి. ప్రెస్ అనే పదాన్ని దుర్వినియోగం చేయడం తప్పయితే, వీఐపీ హోదాను దుర్వినియోగం చేయడం కూడా తప్పే కదా!

-అసలు జర్నలిస్టు అంటే అక్రిడిటేషన్ కార్డు ఉన్నవారేనా?

జిల్లా కలెక్టర్లు, సమాచార శాఖ అధికారులు అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తున్నారు. అది ప్రభుత్వ పరంగా ఒక గుర్తింపు మాత్రమే. కానీ ఒక మీడియా సంస్థలో పనిచేస్తూ రోజూ వార్తలు సేకరించే విలేకరి, కెమెరామెన్, డెస్క్ జర్నలిస్టు, స్ట్రింగర్ వంటి మీడియా ఉద్యోగుల వృత్తిపరమైన ఉనికిని కేవలం ఒక కార్డు ఆధారంగా నిర్ణయించగలమా?

అక్రిడిటేషన్ పొందని ప్రతి ఒక్కరూ జర్నలిస్టులు కాదని చెప్పడం సరైన విధానం కాదు. అక్రిడిటేషన్ అనేది ప్రభుత్వ సౌకర్యాలు, అధికారిక కార్యక్రమాలకు ప్రవేశం, సమాచార సేకరణకు సంబంధించిన గుర్తింపు. జర్నలిజం అనేది ప్రజలకు సమాచారం అందించే వృత్తి.

ఈ రెండింటి మధ్య తేడాను ప్రభుత్వం గుర్తించాలి.

-గుర్తింపు కార్డు ఇచ్చే ప్రభుత్వానికి.. కనీస వేతనాలు ఇప్పించే బాధ్యత లేదా?

ఇక్కడే అసలైన ప్రశ్న మొదలవుతుంది. ఒక మీడియా సంస్థలో పనిచేసే జర్నలిస్టుకు ప్రభుత్వం అక్రిడిటేషన్ ఇస్తుంది. అతను జర్నలిస్టుగా పనిచేస్తున్నాడని గుర్తిస్తుంది. మరి అదే జర్నలిస్టుకు ఆ మీడియా యాజమాన్యం న్యాయమైన వేతనం చెల్లిస్తోందా లేదా అని ఎందుకు ప్రశ్నించడం లేదు?

కొన్ని మీడియా సంస్థల్లో జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. మరికొన్ని చోట్ల నెలల తరబడి జీతాలు ఆలస్యమవుతున్నాయని, కొందరు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని వృత్తి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రోజంతా ఎండనకా, వాననకా తిరుగుతూ వార్తలు సేకరించాలి. ప్రమాదాలు, రాజకీయ సమావేశాలు, ప్రజా సమస్యలు, అధికారుల పర్యటనలు.. ఇలా నిరంతరం విధుల్లో ఉండాలి. కానీ నెలాఖరుకు చేతికి అందే వేతనం కుటుంబ పోషణకు సరిపోకపోతే ఆ జర్నలిస్టు జీవితం ఎలా సాగాలి?

జర్నలిస్టుల వేతనాలు, ఉద్యోగ పరిస్థితులు, సేవా నిబంధనలకు సంబంధించి 1955 నాటి వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం, వేతన బోర్డు సిఫారసులు వంటి చట్టపరమైన వ్యవస్థలు ఉన్నాయి. వాటి అమలులో రాష్ట్ర ప్రభుత్వాలకూ బాధ్యత ఉంది. మరి తెలంగాణ కార్మిక శాఖ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల వేతనాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తోందా? చట్టబద్ధంగా అందాల్సిన వేతనాలు అందుతున్నాయా లేదా అని పరిశీలిస్తోందా? ఉల్లంఘనలకు పాల్పడే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటోందా?

-ఈ ప్రశ్నలకు ప్రభుత్వం, కార్మిక శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

మీడియా యాజమాన్యాలకు ఒక న్యాయం.. జర్నలిస్టులకు మరో న్యాయమా?

ప్రభుత్వం నుంచి ప్రకటనలు, ప్రకటనల రూపంలో ఆదాయం, ఇతర వాణిజ్య ప్రయోజనాలు పొందే మీడియా సంస్థలు తమ ఉద్యోగుల సంక్షేమం విషయంలోనూ బాధ్యత తీసుకోవాలి. జర్నలిస్టుల శ్రమతో సంస్థలు నడుస్తున్నప్పుడు, ఆ శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వడం యాజమాన్యాల కనీస బాధ్యత.

ప్రభుత్వం కూడా అక్రిడిటేషన్ జారీ చేసే ముందు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు, వారి వేతన చెల్లింపులు, ఉద్యోగ భద్రత వంటి అంశాలను పర్యవేక్షించే పారదర్శక వ్యవస్థను బలోపేతం చేయాలి. నిబంధనలు కేవలం జర్నలిస్టులపై కాకుండా మీడియా యాజమాన్యాలపైనా సమానంగా అమలు కావాలి.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే ప్రతి పౌరుడికి జర్నలిస్టు లక్షణం ఉంటుంది!

ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఒక్క మీడియా ప్రతినిధులకే పరిమితం కాదు. ప్రజా సమస్యలపై నిలదీసే ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ ఉంది. అయితే వృత్తిపరమైన జర్నలిజానికి ప్రత్యేక బాధ్యతలు, ప్రమాణాలు, నైతిక విలువలు ఉంటాయి. వాటిని కూడా విస్మరించలేం.

అక్రిడిటేషన్ కార్డు ఉన్నవారే ప్రశ్నించాలి, మిగతావారు మౌనంగా ఉండాలనే భావన ప్రజా స్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదు. ప్రజల తరఫున ప్రశ్నలు సంధించడం జర్నలిజం బాధ్యత అయితే, ప్రతి పౌరుడి గొంతును గౌరవించడం పాలకుల బాధ్యత.

-ప్రభుత్వానికి కొన్ని సూటి ప్రశ్నలు....?

ప్రెస్ స్టిక్కర్ల వినియోగంపై చూపుతున్న శ్రద్ధను వీఐపీ లోగోలు, అనధికారిక సైరన్లు, నిబంధనలకు విరుద్ధమైన హారన్ల నియంత్రణపైనా చూపిస్తారా?

అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు మాత్రమే కాకుండా, అర్హులైన ఇతర మీడియా ఉద్యోగుల వృత్తి పరమైన హక్కుల పరిరక్షణకు ఏ చర్యలు తీసుకుంటారు?

మీడియా సంస్థల్లో కనీస వేతనాలు, వేతన బోర్డు సిఫారసులు, ఉద్యోగ భద్రత అమలవుతున్నాయా లేదా అని కార్మిక శాఖ తనిఖీలు చేస్తోందా?

జర్నలిస్టులకు జీతాలు చెల్లించని, ఉద్యోగుల హక్కులను ఉల్లంఘించే మీడియా యాజమాన్యాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది?

జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, కుటుంబ భద్రతకు మరింత పటిష్ఠమైన విధానం ఎప్పుడు తీసుకొస్తారు?

-మీడియా సంస్థల పోషణ భుజాన వేసుకున్న జర్నలిస్టులు....

నేడు మెయిన్ స్ట్రీమ్ మీడియా అని గొప్పగా చెప్పుకుంటున్న ప్రింట్, సాటిలైట్ ఛానల్స్ యాజమాన్యాలు ప్రధాన నగరాల, జిల్లా, నియోజక, మండల స్థాయి నుంచి నెలవారీ టార్గెట్లు పెట్టి డబ్బు పోగుచేసుకుంటున్నవి. మరోకొన్ని కాలమానాలు, డైరీలు, వార్షికోత్సవాలా సాకుతో వ్యాపార ప్రకటనల టార్గెట్లు, కొన్నిమీడియా సంస్థలు అక్రిడేషన్ కార్డులకు డబ్బులు వసూలు చేస్తున్నవికూడా ఉన్నాయి వీటి సంఘతి ఏమిటి?ఇగ మండల విలేకర్లు నెలవారీ యాజమాన్యలకు తక్కువలో 300నుంచి 1000 రూపాయల వరకు యాజమాన్యలకు చెల్లించే జర్నలిస్టులు ఉన్నారు ఇది సర్కార్ కు తెలియదు అనుకోవడం పొరపాటే అవుతుంది.

ప్రెస్ స్టిక్కర్ తొలగించడం సులభమే కావచ్చు.

కానీ జర్నలిస్టుల జీవితాల్లోని ఆర్థిక అస్థిరతను తొలగించడం అంతకంటే ముఖ్యం. గుర్తింపు కార్డు ఇవ్వడం ప్రభుత్వ విధానంలో ఒక భాగం కావచ్చు. కానీ ఆ గుర్తింపు పొందిన వ్యక్తి గౌరవంగా జీవించే పరిస్థితులు కల్పించడానికి కూడా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలి.

-చివరగా ఒక్క మాట..!

ప్రెస్ అనే పదం వాహనంపై కనిపించడం కంటే, జర్నలిస్టు గొంతులో ప్రజల సమస్యలు వినిపించడం ముఖ్యం.

వాహనంపై స్టిక్కర్ ఉందా లేదా అని చూసే వ్యవస్థ కంటే, జర్నలిస్టు కుటుంబానికి నెలాఖరులో జీతం అందుతోందా లేదా అని చూసే వ్యవస్థ ప్రజలకు, ప్రజాస్వామ్యానికి మరింత అవసరం.

ప్రెస్ స్టిక్కర్లపై ఆంక్షలు విధించే ప్రభుత్వం.. జర్నలిస్టుల హక్కుల విషయంలోనూ అదే చిత్తశుద్ధి చూపాలి. మీడియా యాజమాన్యాల బాధ్యతను ప్రశ్నించాలి. కార్మిక శాఖను జవాబుదారీ చేయాలి. వీఐపీ సంస్కృతికీ, సాధారణ పౌరుడికీ చట్టం ఒకటేనని నిరూపించాలి.

ప్రెస్ గుర్తింపును నియంత్రించడం మాత్రమే కాదు.. ప్రెస్ స్వరాన్ని, జర్నలిస్టుల బతుకును, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత కాదా?

చెప్పాల్సింది చాలా ఉంది....

చదవాల్సింది మిగిలే ఉంది...

సకినాల సుధాకర్ పటేల్.

సీనియర్ జర్నలిస్టు.

వలిగొండ నివాసంలో ప్రజలు, నాయకులను కలిసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

-సమస్యల పరిష్కారానికి అధికా రులకు తక్షణ ఆదేశాలు.

తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

భువనగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈరోజు వలిగొండలోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందినప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలు,అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు,ఇతర ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అంద జేశారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే ఓపికగా విని,వాటి పరి ష్కారానికి సానుకూలంగా స్పం దించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, ఆయా సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరి శీలించి, వాటి పరిష్కారానికి అవ సరమైన చర్యలు తక్షణమే చేప ట్టాలని అధికా రులను ఆదేశిం చారు. ప్రజలకు ఇబ్బందులు కల గకుండా సమస్యల పరిష్కారం లో జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరి ంచాలని సూచించారు.



ప్రజాప్రతినిధిగాప్రజలకు ఎల్లప్పు డూ అందు బాటులో ఉండటం తన బాధ్యతని,నియోజకవర్గ ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారాని కి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలి పారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో వలి గొండ మం డల,గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

కార్తీకోత్సవాల పోస్టర్‌ను ఆవిష్క రించి,మంత్రులకు ఆహ్వానంపలి కిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.





యాదాద్రి భువనగిరి జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లో ఈ నెల 20,21,22 తేదీలలో మూడు రోజులపాటు నిర్వహిం చనున్న కార్తీకోత్సవ వేడుకలకు ఆలయ అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్తీకోత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వవిప్,ఆలేరు శాస నసభ్యులు బీర్ల ఐలయ్య సమ క్షంలోఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్ చార్జి మంత్రి,రాష్ట్ర ఎస్సీ అభివృ ద్ధి,గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సిని మాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి కార్తీకో త్సవ వేడు కలకు ముఖ్య అతిథు లుగా హాజరుకావాలని ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐల య్య మాట్లాడుతూ... యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వా మి క్షేత్రం తెలంగాణలోనే కాకుం డా దేశవ్యా ప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని,కార్తీ కమాసాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవ కాశం ఉందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా దర్శనాలు,పూజా కార్యక్రమాలు,ఇతర సౌక ర్యాల విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రిభువ నగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జ యంతి, ఐఏఎస్, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసి ంహస్వామి దేవస్థా నం కార్యనిర్వహణాధికారి ఈఓ జె. భవానీ శంకర్,ఆలయ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలు నిర్వహించొద్దు

-జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

-జిల్లా ఎస్పీ నర్సింహ

సూర్యాపేట : నవంబర్ 7(తెహెల్కా న్యూస్)

బాణాసంచా విక్రయించే వ్యాపారులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందా లని, అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయరాదని జిల్లా ఎస్పీ నర్సింహ శనివారం ఒక ప్రకటన లో హెచ్చ రించారు. దుకాణాల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు పాటించాలని, నిబంధనలకు అనుగుణంగా మాత్రమే విక్రయాలు నిర్వహించాలని సూచించారు. పండుగను ఆనందంగా జరుపుకోవడమే కాకుండా మన కుటు ంబ సభ్యుల భద్రతతో పాటు చుట్టుపక్కల వారి క్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం. ప్రజలందరి సహకారంతో దీపావళి పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకో వాలని ఆకాంక్షించారు.

-బాణాసంచా ప్రమాదం.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

బాణాసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు, ప్రమాదకరమైన బాణాసంచా వినియోగానికి దూరంగా ఉండాలని తెలిపారు. బాణాసంచా కాల్చేటప్పుడు తగినంత దూరం పాటించాలని, నీటి బకెట్ లేదా ఇసుక అందు బాటులో ఉంచుకోవాలని సూచించారు. చిన్నపిల్లలను ఒంటరిగా బాణాసంచా కాల్చడానికి అనుమతి ంచకుండా పెద్దల పర్యవేక్షణలోనే కాల్చించాలని కోరారు. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారిని బాణాసంచా కాల్చే ప్రదేశాలకు దూరంగా ఉంచాలని తెలిపారు. నివాస ప్రాంతాలు, జనసం చారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, వాహనాల సమీప ంలో బాణాసంచా కాల్చకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. కాల్చిన బాణాసంచా అవశేషాలను నిర్లక్ష్య ంగా వదిలేయకుండా ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

-జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

దీపావళి పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లా ప్రజలందరికీ జిల్లా పోలీస్ శాఖ తరఫున జిల్లా ఎస్పీ



నరసింహ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాం క్షించారు. దీపావళి పండుగను ప్రజలందరూ కుటు ంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ కోరారు. పం డుగ వేళ ఇతరులకు ఇబ్బంది కలగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఐ ఎల్ పి ఎ 6వ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

-ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్

తెహెల్కా న్యూస్



హనుమకొండ జిల్లా కేంద్రం 'డి' కన్వెన్షన్ లో ఈ నెల నవంబర్ 14 న జరుగు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ 6వ రాష్ట్ర సదస్సుకు రాష్ట్రంలోని న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, మహబూబాబాద్ వరంగల్ జిల్లా నర్సంపేట కోర్టులలో న్యాయవాదులు, బార్ అసోసి యేషన్ నాయకులు, ఐ ఎల్ పి ఎ నాయకులతో కలిసి గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అంబేద్కర్ పిలుపునిచ్చిన 'పే బ్యాక్ టు సొసైటీ' లక్ష్యంగా నల్ల కోట్లతో నీలి విప్లవం నినాద ంతో ఐ ఎల్ పి ఎ పనిచేస్తుందని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదితో నిరంతరం బహుజన అణగారిన పేద న్యాయవాదుల వృత్తి నైపుణ్యం కోసం కృషి చేస్తూనే బహుజన సమాజ చైతన్యం కోసం పని చేస్తున్నామని అన్నారు. సాంస్కృ తిక విప్లవం విజయవంతం కాకుండా బహుజన సమాజ విముక్తి జరగదని, భారత రాజ్యాంగం న్యాయ వాదులకు ఉపయోగపడే గ్రంథమే కాదని బడుగు బలహీన వర్గాల జీవితాలను మార్చే స్ఫూర్తి దాయక వాహనమని అలాంటి రాజ్యాంగ స్ఫూర్తిని గ్రామగ్రామానికి తీసుకెళ్లడమే ఐ ఎల్ పి ఎ లక్ష్యమని ఆయన అన్నారు. బి.సి మోర్చా జాతీయ అధ్యక్షులు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన జరుగు సదస్సుకు ముఖ్య అతిథిగా విశ్రాంత హై కోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ కమీషన్ కమీషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి హాజరవుతు న్నారని, గౌరవ అతిథులుగా వరంగల్, హనుమ కొండ జిల్లా జడ్జిలు వి.బి. నిర్మలా గీతాంబ, ఎం.ఆర్. సునీత లు, పంచాయతీ రాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హాజరవు తున్నారని తెలిపారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతంలో మహిళా స్వేచ్ఛ అనే అంశంపై ప్రొఫెసర్ ఇ. సుధారాణి, ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్ల తొలగింపు అనే అంశంపై ప్రొఫెసర్ గుగులోతు వీరన్న నాయక్, సామాజిక న్యాయం - బహుజనుల ఐక్యత అనే అంశంపై తెలుగు అకా డమీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రజాస్వామ్యంలో జడ్జీల నియామకం - లోపాలు అనే అంశంపై ఐ ఎల్ పి ఎ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ ఉపన్యాసాలు ఇస్తారని తెలిపారు. వీరితో పాటు ఐ ఎల్ పి ఎ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్ జె శాంసన్, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, మెటుపల్లి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ రాజారాం, బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాసురాం నాయక్, రాష్ట్రీయ ముక్తి మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ముఫ్తీ మహ మ్మద్ ఫహీమొద్దీన్, ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి రమేష్, ప్రొఫెసర్ వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఆదర్శ విద్యా సంస్థ చైర్మన్ బూర విద్యాసాగర్, బ్యాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి నరేందర్, బ్యాంసెఫ్ నాయ కులు ఎ సంతోష్ కుమార్, ఐ ఎల్ పి ఎ నాయకులు తిప్పన డాంగే, తీగల జీవన్ గౌడ్, వి.ఎం. కృష్ణారెడ్డి, గజ్జల వెంకట్ రెడ్డి, అనంత ఆంజనేయులు, భానుప్రియ, చిల్ల రమేష్, టి. డేవిడ్, మహమ్మద్ ముధసిర్ అహ్మద్, వెంకటయ్య ముదిరాజ్ తదితర మేధావులు హాజరవుతారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర కమిటి సభ్యులు ఎగ్గడి సుందర్ రామ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు విలాసాగరం సురేందర్ గౌడ్, తొర్రూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వెంకటరత్నం, ఉపాధ్యక్షులు నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి టి. సైదులు, మహబూబాబాద్ బార్ అధ్యక్షులు మామి డాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జంగం సిద్ధా ర్థ, ఐ ఎల్ పి ఎ తొర్రూరు బార్ అధ్యక్షులు వలపు మధుసూదన్, కలవకొలను ప్రవీణ్ రాజు, తొర్రూరు న్యాయవాదులు పల్లవి, నాగరాజు, చం ద్రయ్య, మహేష్, ఐలోని, శ్రీధర్, యాకేందర్, రమేష్, మహ బూబాబాద్ న్యాయ వాదులు ఆరేళ్లి శ్రీనివాస్, దర్శనం రామకృష్ణ, బాలాజి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, వాసం ఆనంద్, రాజమణి, మందుల శ్రీనివాస్, హరిబాబు, నర్సంపేట న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, షేక్ రహీమోద్దీన్, దొంతి సాంబయ్య, మోటూరి రవి, రోజ, పండగ శ్రీనివాస్, శివ తదితరులు హాజరయ్యారు.

అన్నోజిగూడలో ఘనంగా అలా య్ బలాయ్ కార్యక్రమం లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య.



తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

అన్నోజిగూడ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అలా య్--బలాయ్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వా హకులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలి కారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కురుమ సంఘం నాయ కులు,సభ్యులతో ఆత్మీయంగా ముచ్చ టించారు. అలాయ్--బలాయ్ వంటి కార్య క్రమాలు కులమతాలకు అతీతం గా ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత,ఆత్మీయతను పెంపొంది స్తాయని పేర్కొన్నారు. సంప్రదాయాలు,సంస్కృతిని కాపాడుకుంటూ సమాజ అభి వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయా లని ఆకాంక్షించారు.

శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో అన్నప్రసాదం

-అన్న ప్రసాద వితరణ కొరకు నూతన షెడ్డు నిర్మాణ భూమి పూజా.



తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

శ్రీ సీతారామాంజనేయ స్వామి సహిత సంతోషిమాత దేవాల యంలో ఈ రోజు అన్న ప్రసాద మునకు సహకరించినదాతలు డొప్ప హరికృష్ణ,మంచి నీళ్లదాత ఇట్టబోయిన రాజు మాదాసు మమత 1120 అన్న ప్రసాదానికి ఇవ్వడం జరిగింది.దాతలకు ఆ స్వా మివారి కృపా కటాక్షాలు ఆయుర్ ఆరోగ్యం ఐశ్వర్యం కలగాలి. అన్నప్రసాద వితరణ కొరకు నూ తన షెడ్డు నిర్మాణ భూమి పూజా కార్యక్రమం నిర్వహి ంచారు. అన్నప్రసాదవితరణ కార్యక్రమం కొరకు నూతనగా షెడ్డు నిర్మాణ పనులు ఆలయ కమిటీ,అయ్య ప్ప సేవసమితి వారిఆధ్వర్యం లో ప్రారంభించడం జరిగింది. ఇట్టి పూజా కార్య క్రమంలో పా ల్గొన్న ప్రతి ఒక్కరికి దేవాలయ కమిటీ ద్వారా ధన్యవాదాలు తెలుపుతూ అలాగే షెడ్ నిర్మా ణానికి ఇంకా భక్తుల సహాయ సహకారాలు అందిం చగలరని కోరారు. దాతలకు ఆ స్వామివారి కృపా కటాక్షాలు ఆయుర్ ఆరోగ్యం ఐ శ్వర్యం కలగాలనీ కోరుకుంటూ. ఈ కార్యక్రమంలో ఆలయ పూ జారులు,ఆలయకమిటీసభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాల సమ స్యలను వెంటనే పరిష్కరించాలి

-టీజేఏ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా.



తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

యాదాద్రిభువనగిరి జిల్లావ్యాప్తం గా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియే షన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు,జిల్లా మీడియా అక్రి డిటేషన్ కమిటీ సభ్యుడు మొహ మ్మద్ షానూర్ ప్రభుత్వాన్ని కోరారు.శనివారం బీబీనగర్ పట్టణం లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొంత ఇళ్లు లేక అనేకమంది జర్నలిస్టులు అద్దె ఇళ్లలో నివసిస్తూఆర్థిక ఇబ్బం దు లు ఎదుర్కొంటున్నారని ఆవేద న వ్యక్తం చేశారు. ప్రజా సమస్య లను నిరంతరం వెలుగులోకి తెస్తూ సమాజానికి సేవచేస్తున్న జర్నలిస్టు లసంక్షేమా నికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వా లని అన్నారు.అర్హులైన జర్నలి స్టులకు ఇందిరమ్మ గృహ పథకం లో ప్రాధాన్యత కల్పించి,వారి సొంత ఇంటి కలను సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఏ బీబీ నగర్ మండల అధ్యక్షుడు రెడ్డ బోయిన మహేష్, కార్యదర్శి మంచాల అనిల్,సభ్యులు ఇంది రాల శివాజీ, పాముకుంట్ల ఉషా కిరణ్,బింగి చంద్ర శేఖర్ తదిత రులు పాల్గొన్నారు.

భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కా ర్యాలయంలో ఘనంగా చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ జన్మదిన వేడుకలు

తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగ ళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ జన్మ దిన వేడుకలు శనివారం భువన గిరి పట్టణ ఎమ్మెల్యే క్యాంప్ కా ర్యాలయం లో అత్యంత ఘనం గా,అంగరంగ వైభవంగా జరిగా యి.క్యాంప్ కార్యాలయం లో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో క్యాంప్ కార్యాలయా నికి తరలివచ్చారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ తో కలిసి కేక్ కట్ చే యించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైర్మన్ గారి కు పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ..శ్రీవాణి రవికుమార్ భువనగిరి పట్టణ అభివృద్ధి కోసం నిరంత రం కృషి చేస్తున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,పట్టణ సమస్యల పరి ష్కారం కోసం చిత్తశు ద్ధితో పని చేస్తున్నారు. వారికి భగవంతు డు ఆయు రారోగ్యాలు, మరింత ప్రజాసేవ చేసే శక్తిని ప్రసాదించా లని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నాను అని అన్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. తనపై చూపిస్తున్న ప్రేమాభిమా నాలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్,ఎమ్మెల్యే సహకా రంతో,మీ అందరి ఆశీర్వాదంతో భువనగిరి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాను. ప్రజల సంక్షేమమే నా ధ్యేయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్,కాంగ్రెస్ సీ నియర్ నాయకులు నక్కల ఆది నారాయణ,భువనగిరి పట్టణ సీనియర్ కాంగ్రెస్



నాయకులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు,ము న్సిపల్ కౌన్సిలర్లు,మాజీ కౌన్సిల ర్లు,యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అభి మానులు పెద్ద సంఖ్యలో పాల్గొని చైర్మన్ కి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.


బంగారం ధరలు

manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES
24 kt ₹ 1,43,560 10gms
22 kt ₹ 1,31,600 10gms
SILVER ₹ 1,89,900 1kg
Contact: 6309 111299 | 99120 10888

తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న గంజాయి అక్రమ రవాణా నెట్‌వర్క్ గుట్టురట్టు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్ తెహెల్కా న్యూస్

ఒక కీలక పరిణామంలో, హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ మరియు తెలంగాణ 'ఈగిల్ ఫోర్స్' (EAGLE Force) సాంకేతిక విభాగం సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో, హైదరాబాద్‌లోని నానక్‌రామ్ గూడకు చెందిన కలపతి నీతు బాయి (51)ని 06.11.2026న పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలు 2017 నుండి గంజాయి అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమె భారీ మొత్తంలో గంజాయిని సేకరించి, చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి, నానక్‌రామ్‌గూడ మరియు దాని పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులకు విక్రయిస్తోంది. గత రెండేళ్లలో గచ్చిబౌలి పోలీసులు, ఈగిల్ ఫోర్స్ మరియు ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన సుమారు 12 ఎన్.డి.పి.ఎస్ (NDPS) కేసుల్లో ఆమె నిందితురాలిగా ఉంది. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు, ఆమె నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి మరియు లంగర్ హౌజ్ ప్రాంతాల మధ్య నివాసాలను మారుస్తూ వస్తోంది. నిరంతర నిఘా మరియు పట్టుదల గల ప్రయత్నాల ఫలితంగా, ఈగిల్ ఫోర్స్ ఆమెను గుర్తించి అదుపు లోకి తీసుకుంది. ప్రస్తుతం ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా ఆర్జించిన సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలు మరియు ఇతర ఆర్థిక ఆస్తులను గుర్తించేందుకు తదుపరి విచారణ కొనసాగుతోంది.

#DrugfreeTelangana #eagleforce #SayNoToDrugs #arrest

-డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయడానికి:

- మా టోల్ ఫ్రీ నంబర్: 1908కు కాల్ చేయవచ్చు.
- 'ఈగిల్ టీజీ' (EAGLE TG) కంట్రోల్ రూమ్ నంబర్ 8712671111కు కాల్ చేయవచ్చు లేదా సందేశం పంపవచ్చు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

తెలంగాణ సీఎంఓ (Telangana CMO), హైదరాబాద్ సిటీ పోలీస్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఇండియా

641 జీవో రద్దు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షుడు అత్తాపూర్ మహేందర్ రెడ్డి

తెహెల్కా రంగారెడ్డి జిల్లా నవంబర్ 7ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

సిద్దాపూర్ డంపింగ్ యార్డు విషయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న ప్రకటనలు ప్రజలను మభ్యపెట్టే రాజకీయ నాటకాలేనని బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షుడు అత్తాపూర్ మహేందర్ రెడ్డి విమర్శించారు.నందిగామలో జరిగిన సమా వేశంలో మంత్రి సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయనివ్వబోమని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ..అసలు 641 జీవో తీసుకురావాలని ప్రభుత్వాన్ని ఎవరు కోరారని ప్రశ్నించారు.నాలుగు నెలలుగా సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలను భయాందోళనలకు గురిచేసింది మీ ప్రభుత్వమే కాదా? అని నిలదీశారు.ప్రజల అభిప్రా యాలను పట్టించుకోకుండా 641 జీవో తీసుకొచ్చి, ఇప్పుడు ప్రజల ముందు మొసలి కన్నీరు కార్చడం ఎందుకని ప్రశ్నించారు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశు



ద్ధి ఉంటేసమావేశాల్లో ప్రకటనలు చేయడం మానేసి ,ముందుగా 641 జీవోను రద్దు చేసి తన మాటకు కట్టుబడి ఉన్నట్లు నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.నాలుగు నెలలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసి,గ్రామాల మధ్య ఆందోళనలకు కారణమైన ప్రభుత్వం ఇప్పుడు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయ బోమని చెప్పడం రాజకీయ నాటక మేనని విమర్శించారు.ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకట నలు మానుకొని స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని హితవు పలికారు.కొత్తూరు మండల ప్రజల సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరిం చారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు విషయంలో మాటల గారడీ కాదు.. 641 జీవో రద్దే ప్రజలకు కావాల్సిన పరిష్కారం. తక్షణమే జీవోను రద్దు చేసి సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి అని అత్తాపూర్ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

సామాజిక న్యాయం, సమానత్వం కోసం భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలి -- రాగల్ల ఉపేందర్ మాదిగ

తెహెల్కా రంగారెడ్డి జిల్లా నవంబర్ 7ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించుకున్న నేపథ్యంలో, ఇకపై కుల, మత, వర్గ, లింగ వివక్షతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, సామాజిక ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించడమే లక్ష్యంగా భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు.మహేశ్వరం మండల పరిధిలోని తుక్కుగూడ శ్రీ కళాశ్రీ గార్డెన్స్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ ఉద్యమం విజయవంతమైనా దాని వెనుక విద్యార్థుల శక్తి, భాగస్వా



మ్యం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలోనూ మాదిగ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశంలో కొనసాగుతున్న కుల, మత, లింగ వివక్షతలను రూపుమాపి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు మహనీయుల ఆశయాల స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ భవిష్యత్ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని కోరారు.ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి విద్యాసంస్థ, హాస్టల్‌లో నూతన ఎమ్మెస్ఎఫ్ కమిటీలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 22లోపు గ్రామ,మండల స్థాయిలో విద్యార్థు లతో సమావేశాలు నిర్వహించి నూతన ఎమ్మెస్ఎఫ్ జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులను భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం చేయాలని సూచించారు.అల్మాస్‌గూడలో దళిత క్రైస్తవ యువతులపై జరిగిన దాడి ఘటనను ప్రస్తావిస్తూ,అరెస్టు చేసిన వ్యక్తుల వివరాలను పోలీసులు బహిర్గతం చేయాలని, బాధిత యువతులు ప్రస్తుతం ఎవరి సంరక్షణలో



ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.మత వైషమ్యాలకు తావులేకుండా రాజ్యాంగాన్ని గౌరవిం చాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మహిళలపై దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం,పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరించాలని కోరారు.ఈ సమావే శంలో ఎమ్మెస్ఎఫ్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఆల్ ఇండియా క్రైస్తవ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు విజయరావు,రావుగళ్ల బాబు మాదిగ,కేశపాక రామచంద్ర మాదిగ,పంగ ప్రణయ్ మాదిగ,నాని భానుప్రసాద్ మాదిగ,ప్రభాకర్ మాదిగ, పోతుగంటి కృష్ణ మాదిగ,ఎర్ర కృష్ణ మాదిగ,ఎర్ర నవీన్ కుమార్ మాదిగ,ఎర్ర గణేష్ మాదిగ, కాడిగాళ్ల ప్రవీణ్ మాదిగ,బుసన్నగారి శేఖర్,నడికూడ అర్జున్ మాదిగ,పెండ్యాల వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.

కోరిటికల్ గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పను లను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య.



తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

ఆత్మకూరు మండలం కోరిటికల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర ప్ర భుత్వవిప్,ఆలేరు శాసనసభ్య లు బీర్ల అయిలయ్య సందర్శిం చి నిర్మాణ పనులను పరిశీలిం చారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సర ఫరాను మరింత మెరుగుపరిచి, రైతులకు, ప్రజలకు ఎలాంటి వి ద్యుత్ అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించ డమే లక్ష్యంగా ప్రభుత్వం చర్య లు చేపడుతోందని ఈ సందర్భం గా పేర్కొన్నారు.సబ్‌స్టేషన్ నిర్మా ణ పనులను నాణ్యతా ప్రమాణా లతో,వేగవంతంగా పూర్తి చేయా లని సంబంధిత అధికారు లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శేర్లింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన సురభి రమేష్ రావు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ నవంబర్ 7



శేర్లింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ ఆల్విన్ కాలనీ డివిజన్ బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సురభి రమేష్ రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపినారు ఈ దీపావళి ప్రజల జీవితాల్లో కోటి కాంతులు నింపాలని ఆకాంక్షించారు చెడుపై మంచి సాధించిన విజయా నికి చిహ్నంగా చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండగగా దుష్టశక్తు లపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి ప్రతి ఇంట ఆనందాలను సిరులను కురిపించాలని ఆయన ఆకాంక్షించారు నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు సంపదలు వెలగాలని కోరుకున్నారు మనలోని అజ్ఞా నందాకారాన్ని తొలగించి జ్ఞాన దీపాలు వెలిగించేదే దీపావళి ఈ దీపావళి పర్వదినాన్ని ఆ ధనలక్ష్మి ధాన్యలక్ష్మి ల తో శేర్లింగంపల్లి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నానని సురభి రమేష్ రావు పేర్కొన్నారు ఈ దీపావళి పండగ బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకో వాలని భక్తి శ్రద్ధలతో పండగ జరుపుకోవాలని సురభి రమేష్ రావు ఆకాంక్షించారు.

చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం



ఎల్.బి.నగర్,నవంబర్ 07, తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని చార్మినార్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, దేవాలయ ట్రస్టీ శశికళ ఆహ్వానం మేరకు ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్త మధుసాగర్,లోహిత్, చందు మరియు ఇతరులు పాల్గొన్నారు.

దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలి -- చిక్కిరి శ్రీకాంత్

తెహెల్కా రంగారెడ్డి జిల్లా నవంబర్ 7ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని సీనియర్ జర్నలిస్ట్ చిక్కిరి శ్రీకాంత్ ఆకాంక్షించారు.దీపావళి పర్వదినాన్ని పురస్కరిం చుకుని మహేశ్వరం నియో జకవర్గ ప్రజలకు ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు .దీపాల కాంతులతో ప్రతి ఇల్లు వెలిగిపోవాలని,ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆనందం, ఆప్యా యతలు వెల్లివిరి యాలని కోరుకున్నారు.ప్రజల జీవితాల్లో దీపావళి కొత్త ఆశలు, సాను కూల ఆలోచనలు నింపాలని పేర్కొన్నారు.పండుగను ఆనందో త్సాహాల మధ్య జరుపుకోవడంతో పాటు భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటిం చాలని సూచించారు.ముఖ్యంగా చిన్నపిల్లలు టపా సులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,వారి పర్యవేక్షణ లోనే బాణాసంచా కాల్చేలా చూడాలని కోరారు.ప్రజలందరూ ఆయురారో గ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని చిక్కిరి శ్రీకాంత్ ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్ : నవంబర్ 07 : తెహెల్కా న్యూస్

హైదరాబాద్ లోని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా దీపావళి పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ కుక్కే సుబ్రహ్మణ్య స్వామి వారి ప్రసాదాని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ బీఆర్ఎస్ సర్కిల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్, పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, బీఆర్ఎస్ యువ నాయకులు శ్రీశైలం యాదవ్, తదితరులు పాల్గొన్నారు..

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేతుల మీదుగా "మెడ్ ప్లస్" నూతన స్టార్ ప్రారంభం

కుత్బుల్లాపూర్ : నవంబర్ 07 : తెహెల్కా న్యూస్



కుత్బుల్లాపూర్ 130 – సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ చౌరస్తాలో రంగారావు, సురేంద్ర రావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "మెడ్ ప్లస్" నూతన స్టోర్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, డాక్టర్ హుస్సేన్, యూసుఫ్, ప్రభాకర్, గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, సత్యనారాయణ గౌడ్, అంజి ముదిరాజ్, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ధర్మ శాస్త్ర అన్నప్రసాద సేవా సమితి శ్రీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం



కుత్బుల్లాపూర్ : నవంబర్ 07 : తెహెల్కా న్యూస్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధి కుత్బుల్లాపూర్ గ్రామం వేణుగోపాల స్వామి ఆలయం లో మణికంఠ సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం లో పాల్గొని తదుపరి. బీరప్ప నగర్ లో బీరప్ప ఆలయం లో శ్రీ ధర్మ శాస్త్ర అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.

అందరి ఆత్మీయుడు అవ్వారి రఘు

-హైదరాబాద్ ప్రెస్ క్లబ్, ఉదయం ఉద్యోగుల ఆధ్వర్యంలో సంస్మరణ సభలో వక్తలు

హైదరాబాద్, నవంబర్ 7 తెహెల్కా న్యూస్:

అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసిన సీనియర్ జర్నలిస్ట్, జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ (JNJHS) సభ్యుడు అవ్వారి రఘు అందరికీ ఆత్మీయులని పలువురు సీనియర్ జర్నలిస్టులు నివాళు లర్పించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్, ఉదయం ఉద్యోగుల ఆధ్వర్యంలో రఘు సంస్మరణ సభ శనివారం ప్రెస్ క్లబ్ లో జరిగింది. సభకు హాజరైన జర్నలిస్టులు రఘు తో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. చివరివరకూ విలువలతో కూడిన జర్నలిజం చేసిన నిఖార్సైన జర్నలిస్ట్ రఘు అని కొనియాడారు. మీడియా సంస్థల్లో ఇమడలేక సొంతంగా ఆర్ ఎన్ ఏ న్యూస్ ఏజెన్సీ ప్రారంభించి పత్రికలకు అండగా నిలిచారన్నారు. జీవితాంతం జర్నలిజానికి సేవలు చేసిన అవ్వారి రఘుకి జర్నలిస్టు సంఘాలు అండగా నిలవక పోవటం బాధాకరమని అన్నారు. రఘు కుటుంబానికి సహకరించిన హైదరా బాద్ ప్రెస్ క్లబ్ కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, సీనియర్ జర్నలిస్టులు మాడభూషి శ్రీధర్, పాశం యాదగిరి, హేమసుందర్, సైదా రెడ్డి, బాల భాస్కర్, JNJHS డైరెక్టర్లు రమణా రావు, అశోక్ రెడ్డి, ట్యాంక్ బండ్ రాములు, కే.ఎన్. భాస్కర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బట్టిపాటి రాజశేఖర్, మహిళా జర్నలిస్టులు అరుణ, యశోద, ఉమ, కుటుంబ



సభ్యులు హాజరయ్యారు.

నకిలీ ప్రభుత్వ అధికారిగా చలామణి: హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ చేతిలో నిందితుడి అరెస్టు

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్ తెహెల్కా న్యూస్

ప్రభుత్వ అధికారిగా నటిస్తూ మోసాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసిన హైదరాబాద్ టాస్క్ ఫోర్స్; ఇతనిపై 43 కేసులు నమోదు 7 నవంబర్ 2026 ప్రభుత్వ అధికారిగా నటిస్తూ మోసాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసిన హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ (గోల్కొండ జోన్) మరియు ఫిల్మ్ నగర్ పోలీసులు సంయుక్తంగా తోట బాలాజీ నాయుడు అనే 53 ఏళ్ల మోసగాడిని అరెస్టు చేశారు. ఇతనిపై ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 43 కేసులు నమోదై ఉన్నాయి. నాయుడు తాను ఒక ఉన్నత ప్రభుత్వ అధికారిని అని నమ్మించి, ప్రజా ప్రతినిధుల నుంచి, అలాగే హైదరాబాద్ నగర పోలీసు సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. పోలీసుల కథనం ప్రకారం, నాయుడు (ఇతను అనిల్ కుమార్, మల్లారెడ్డి వంటి పేర్లతో కూడా పిలవబడతాడు) వివిధ వెబ్‌సైట్ల ద్వారా ప్రజా ప్రతినిధుల సంప్రదింపు వివరాలను సేకరించేవాడు. తాను సచివాలయంలోని ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శిని (Additional Secretary) అని చెప్పుకుంటూ వారికి ఫోన్ చేసేవాడు. 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' మరియు ముఖ్యమంత్రి నిరుద్యోగ పథకాల వంటి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నట్లు నమ్మించి, ఆ పథకాల కోసం అంటూ వారి నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. గతంలో ఇతను అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (AEE) మరియు అసిస్టెంట్ ఇంజనీర్ (AE) హోదాల్లో ఉన్నట్లు నటించాడు. 2008లో ఇతనిని అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు పట్టుకుని, కేసును సీబీఐ (CBI)కి అప్పగించారు. ఆ ఘటన తర్వాతే ఇతను ప్రజా ప్రతినిధుల వివరాలను సేకరించడం మొదలు పెట్టినట్లు సమాచారం. 2016లో బంజారాహిల్స్ పోలీసులు ఇతనిపై 'పబ్లిక్ డిజార్డర్ యాక్ట్' (ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యల నిరోధక చట్టం) కింద కేసు నమోదు చేశారు. ఇతనిపై ఉన్న అనేక కేసులలో, తాజాగా వెలుగులోకి వచ్చిన రెండు కేసులు ఇవి: ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 505/2026 (దీమీ సెక్షన్లు 318(4), 319(2) మరియు ఐటీ చట్టం సెక్షన్లు 66(జ), 66(D) కింద), అలాగే మంచిర్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 259/2026



(దీమీ సెక్షన్ 318(4) మరియు ఐటీ చట్టం సెక్షన్ 66(D) కింద). ఈ అరెస్టు ప్రక్రియను గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ మరియు ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎ. రమేష్ పర్యవేక్షించారు. సబ్-ఇన్‌స్పెక్టర్లు జి. విజయానంద్ మరియు షేక్ సలీం, తమతమ బృందాలతో కలిసి ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.

నూతన మార్కెట్ చైర్మన్ గా పాశం సత్తిరెడ్డిని ప్రకటించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

తెహెల్కా న్యూస్ భువనగిరి 7-11-2026.

మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డిని వలిగొండ మార్కెట్ చైర్మన్ గా యాదాద్రి భువనగిరి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ప్రక టించారు.ఈ సందర్భంగా పాశం సత్తిరెడ్డి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి పెద్దలుఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చైర్మన్ పదవి కట్టబెట్టినందుకు ఎలాంటి అప్ర తిష్ట అవకతవకలు జరగకుండ మంచి పేరు తెచ్చి పెడతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గడిచే రవి,మండల కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహ దేవ్ జానకిరామ్ ఎంపీపీ నూతి రమేష్ రాజు పాల్సన్ సతీష్ కా సుల వెంకన్న.కొండూరు సాయి యూత్ అధ్యక్షులు పార్టీ నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా అనుమతుల మాటున అక్రమ వసూళ్లు!

-ఉప్పల్ ఫైర్‌స్టేషన్‌పై ఏసీబీ దాడులు.. రూ.30 వేల నగదు, 80 ఆన్‌లైన్ లావాదేవీల గుర్తింపు

తెహెల్కా న్యూస్ (నవంబర్ 7) హైదరాబాద్ :

దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమ తులు ఇచ్చే విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడు తున్నారనే ఆరోపణలతో హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ఎల్బీనగర్ ఫైర్‌స్టేషన్‌పై ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫైర్‌స్టేషన్ సిబ్బంది వద్ద రూ.30 వేల అనధికార నగదును గుర్తించడంతో పాటు, వారి మొబైల్ ఫోన్లలో సుమారు 80 అనుమానాస్పద ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించినట్లు సమాచారం. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా బాణసంచా దుకాణాల నిర్వాహకుల నుంచి రూ.500 నుంచి రూ.5 వేల వరకు చెల్లింపులు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.తాత్కాలిక బాణసంచా దుకా ణం లైసె న్సుకు ప్రభుత్వం నిర్ణయించిన అధికారిక రుసుము కేవలం రూ.500 మాత్రమే. అయినప్పటికీ అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులతో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. మొత్తం 397 దరఖాస్తులు రాగా, వాటిలో 26 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తులు, డబ్బుల చెల్లింపులకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది. కోదాడలోనూ ఇలాంటి అక్రమాలకు తావులేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ



చేపట్టాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్ణీత రుసు ములకే పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

దుండిగల్‌లో మహిళపై అత్యాచారం.. బైక్ ట్యాక్సీ రైడర్ అరెస్ట్

తెహెల్కా న్యూస్ (నవంబర్ 7) హైదరాబాద్ :

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 23 ఏళ్ల బైక్ ట్యాక్సీ రైడర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు కుటుంబ సభ్యు లకు విషయం తెలియజేసి పోలీసులను ఆశ్రయిం చింది. నిందితుడు గత వారం రోజులుగా బాధితు రాలిని వెంటాడుతూ ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె ప్రతిపాదనను తిరస్కరి ంచడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని న్యా యస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.



బిజినెస్

దీపావళి ధమాకా.. దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల వ్యాపారం!



దేశవ్యాప్తంగా దీపావళి పండుగ సీజన్ వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సీజన్‌లో సుమారు రూ.5 లక్షల కోట్ల భారీ వ్యాపారం జరుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. దేశ రాజధాని ఢిల్లీలోనే దాదాపు రూ.80,000 కోట్ల వాణిజ్యం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ పండుగ సీజన్ దేశవ్యాప్తంగా వ్యాపారులకు గొప్ప అవకాశాలను తెచ్చిపెట్టిందని అన్నారు. ముఖ్యంగా వినియోగదారుల నుంచి స్వదేశీ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ కనిపిస్తోందని తెలిపారు. గత నెలలో ర్యాలీలు, నిరసనల కారణంగా వ్యాపార నష్టాలను ఎదుర్కొన్న ఢిల్లీ వ్యాపారులు, ఈ దీపావళి అమ్మకాలతో ఆ నష్టాలను పూడ్చుకుని లాభాల బాట పడతామని ఆశిస్తున్నారని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా ఉన్నాయని చెప్పడానికి ఆటోమొబైల్ అమ్మకాలే నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం.. రిటైల్ ఆటోమొబైల్ అమ్మకాలు 55 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలు 70 శాతం, ద్విచక్ర వాహనాలు 52 శాతం, త్రీ-వీలర్లు 110 శాతం వృద్ధిని నమోదు చేశాయని, ఇది బలమైన వినియోగదారుల డిమాండ్‌కు సంకేతమని అన్నారు. ఈ ఏడాది పండుగ సీజన్‌లో స్వదేశీ వస్తువులకే ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గోయల్ తెలిపారు. మట్టి ప్రమిదలు, దేవుళ్ల విగ్రహాలు, హస్తకళా ఉత్పత్తులు, గోడ అలంకరణ వస్తువులు, శుభ్-లాభ్, ఓం వంటి సాంప్రదాయ చిహ్నాలకు మంచి డిమాండ్ కనిపిస్తోందన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకునేవారికి గుడ్‌న్యూస్.. వడ్డీరేట్లు పెంచిన హెచ్‌డీఎఫ్‌సీ



దేశంలోని అతిపెద్ద ప్రైవేటు బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాదారులకు తీపి కబురు అందించింది. రూ.3 కోట్లలోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) ఎంపిక చేసిన కాలపరిమితులకు వడ్డీ రేట్లను పెంచింది. గరిష్ఠంగా 50 బేసిస్ పాయింట్ల మేర పెంపు చేపట్టింది. సవరించిన రేట్లు నవంబర్ 4 నుంచి అమల్లోకి వచ్చాయి. తాజా నిర్ణయంతో సాధారణ ఖాతాదారులకు గరిష్ఠంగా 6.60 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.20 శాతం వడ్డీ లభించనుంది.సాధారణ ఖాతాదారులకు 61 రోజుల నుంచి ఆరు నెలల కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీని 50 బేసిస్ పాయింట్లు పెంచి 4.75 శాతానికి చేర్చింది. ఆరు నెలల ఒక రోజు నుంచి తొమ్మిది నెలలలోపు డిపాజిట్లపై 15 బేసిస్ పాయింట్లు పెంచి 5.65 శాతంగా నిర్ణయించింది. తొమ్మిది నెలల ఒక రోజు నుంచి ఏడాదిలోపు డిపాజిట్లపై వడ్డీని 5.75 శాతం నుంచి 5.90 శాతానికి పెంచింది.దీర్ఘకాలిక డిపాజిట్లపైనా బ్యాంకు రేట్లను సవరించింది. 18 నెలల ఒక రోజు నుంచి రెండేళ్లలోపు డిపాజిట్లపై 6.45 శాతంగా ఉన్న వడ్డీని 6.50 శాతానికి పెంచింది. రెండేళ్ల ఒక రోజు నుంచి మూడేళ్లలోపు డిపాజిట్లపై 6.45 శాతం నుంచి 6.55 శాతానికి చేర్చింది. మూడేళ్ల ఒక రోజు నుంచి ఐదేళ్లలోపు డిపాజిట్లపై 6.60 శాతం వడ్డీ అందించనుంది. ఐదేళ్ల ఒక రోజు నుంచి పదేళ్ల కాలపరిమితి డిపాజిట్లపై అత్యధికంగా 45 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో వడ్డీ రేటు 6.15 శాతం నుంచి 6.60 శాతానికి చేరింది. సీనియర్ సిటిజన్లకు 61 రోజుల నుంచి ఆరు నెలలలోపు డిపాజిట్లపై వడ్డీని 50 బేసిస్ పాయింట్లు పెంచి 5.25 శాతంగా నిర్ణయించింది. మూడేళ్ల ఒక రోజు నుంచి ఐదేళ్లలోపు డిపాజిట్లపై అత్యధికంగా 7.20 శాతం వడ్డీ లభించనుంది. ఐదేళ్ల ఒక రోజు నుంచి పదేళ్లలోపు డిపాజిట్లపై రేటును 6.65 శాతం నుంచి 7.10 శాతానికి పెంచింది.ఇటీవలి నెలల్లో ఐసీఐసీఐ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు కూడా ఎంపిక చేసిన ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లను సవరించాయి. దీంతో డిపాజిట్‌దారులు వివిధ బ్యాంకులు అందిస్తున్న రేట్లను పోల్చి చూసుకుని పెట్టుబడి నిర్ణయం తీసుకోవడం మంచిది.

చమురు శుద్ధిలో భారత్ దూకుడు.. అమెరికా, యూరప్‌పై వ్యూహాత్మక ఆధిక్యం



ముడి చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మాత్రం ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోంది. అమెరికా, ఐరోపా దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని తగ్గించుకుంటుంటే.. భారత్ మాత్రం దాన్ని విస్తరిస్తోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో దేశానికి వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తోందని 'ఇండియా నెరేటివ్' కథనం విశ్లేషించింది. 2026 ఏప్రిల్ నాటికి భారత్ చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 267.1 మిలియన్ టన్నులుగా ఉంది. రోజుకు సుమారు 53 నుంచి 56 లక్షల బ్యారెళ్లకు సమానమైన ఈ సామర్థ్యంతో ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, రష్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి శుద్ధి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలంలో 400 మిలియన్ టన్నులకు చేర్చాలని భావిస్తోంది. భారత్ రోజుకు 54 నుంచి 56 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇందులో రష్యా వాటా ఇటీవల 18 నుంచి 20 లక్షల బ్యారెళ్లుగా ఉంది. మొత్తం దిగుమతుల్లో ఇది దాదాపు 35 శాతం. గతంలో ఈ వాటా 50 శాతాన్ని దాటిన సందర్భాలున్నాయి. ధరల ఆధారంగా భారత్ కొనుగోళ్ల నిర్ణయాలు తీసుకుంటోందని కథనం పేర్కొంది. మరోవైపు శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా భారత్‌కు భారీ ఆదాయం వస్తోంది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఈ ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో డీజిల్ వాటా 12.6 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో రోజుకు సుమారు 6.2 లక్షల బ్యారెళ్ల డీజిల్‌ను భారత్ ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు సగం ఐరోపా దేశాలకే వెళ్లింది. రష్యా ఉత్పత్తులపై పరిమితులు, ఐరోపాలో రిఫైనరీల మూసివేత, మధ్యప్రాచ్యంలో నిర్వహణ పనుల కారణంగా ఏర్పడిన కొరతను భారత ఎగుమతులు కొంతవరకు భర్తీ చేస్తున్నాయి. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడి తెస్తున్నా.. భారత రిఫైనరీల్లో శుద్ధి చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాకు ఉపయోగపడుతున్నాయని కథనం విశ్లేషించింది. ఇంధన ధరలు పెరిగినప్పుడు అమెరికా కూడా కొన్ని ఆంక్షల విషయంలో మినహాయింపులు ఇచ్చిందని గుర్తుచేసింది.

కివీస్‌పై చెలరేగిన గుర్నూర్ బ్రార్.. జవగళ్ శ్రీనాథ్ తర్వాత అరుదైన ఘనత



వెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 30 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా కివీస్ జట్టు 134 పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్ గడ్డపై ఒక భారత ఫాస్ట్ బౌలర్ నమోదు చేసిన రెండో అత్యుత్తమ గణాంకాలు ఇవి. 2003లో ఆక్లాండ్‌లో జవగళ్ శ్రీనాథ్ (4/23) నెలకొల్పిన రికార్డు అగ్రస్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే భారత పేసర్లు చెలరేగడంతో న్యూజిలాండ్ 53 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో డారిల్ మిచెల్ (55), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31) ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే శాంట్నర్‌ను ఔట్ చేసిన గుర్నూర్ బ్రార్ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. గుర్నూర్ బ్రార్ తన స్పెల్‌లో టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్, శాంట్నర్ వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపాడు. అతనికి తోడుగా అక్షర్ పటేల్, ఆఖిబ్ నబీ, అన్షుల్ కంబోజ్ తలో రెండు వికెట్లు తీయడంతో కివీస్ ఇన్నింగ్స్ ముగిసింది. 5 వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచేందుకు భారత్ ఇప్పుడు 135 పరుగులు చేయాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు గుర్నూర్ 7 వికెట్లతో లీడింగ్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు.

రెండో వన్డేలో బ్యాటర్ల కష్టాలు.. పిచ్‌పై కివీస్ స్టార్ బ్యాటర్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత్‌తో రెండో వన్డేలో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. వెల్లింగ్టన్ పిచ్‌పై బంతి అనూహ్యంగా బౌన్స్ అవుతోందని కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ తెలిపాడు. ఎప్పుడు ఎంత ఎత్తులో వస్తుందో అంచనా వేయలేకపోయామని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 134 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు సైతం ఆచితూచి ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.పరిస్థితులకు తగ్గట్టుగా ఆడేందుకు ప్రయత్నించామని, అయినా ఆశించిన స్కోరు సాధించలేకపోయామని మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ మిచెల్ వివరించాడు. పరుగులు చేయడానికి గ్యాప్‌లు వెతకడం, సింగిల్స్ తీయడం కూడా కష్టంగా మారిందని మిచెల్ తెలిపాడు. డ్రాప్ ఇన్ పిచ్ కావడంతో బంతి బ్యాట్‌కు తగిలిన తర్వాత వేగంగా ఫీల్డర్లను దాటడం లేదని చెప్పాడు. దీంతో స్ట్రైక్ రొటేట్ చేయడం మరింత కష్టమైందని వివరించాడు. న్యూజిలాండ్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన సమయంలో మిచెల్, శాంట్నర్ జట్టును ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ప్రతిసారీ వికెట్లు కోల్పోవడం జట్టుకు ఇబ్బందిగా మారిందని చెప్పాడు.134 పరుగుల లక్ష్యం తక్కువేనని మిచెల్ అంగీకరించాడు. అయినప్పటికీ భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో తొలి వికెట్లు త్వరగా పడగొడితే మ్యాచ్‌లో అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. మిడిల్ ఆర్డర్‌ను ఒత్తిడిలోకి నెట్టగలిగితే ఏదైనా జరగొచ్చని పేర్కొన్నాడు.

స్పోర్ట్స్

అతడిలో ఇంకా సత్తా ఉంది.. షమీ విషయంలో సెలక్టర్లు తప్పు చేశారు: రవిశాస్త్రి



భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. సుదీర్ఘకాలంగా సెలక్టర్లు తనను పక్కన పెట్టడంతోనే షమీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడని, ఇది చాలా బాధాకరమని అన్నాడు. షమీ విషయంలో సెలక్టర్లు అనుసరించిన వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత మూడేళ్లుగా టెస్ట్ జట్టులో చోటు దక్కకపోవడంతో షమీ తన రెడ్-బాల్ కెరీర్‌కు ముగింపు పలికిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై భారత్-న్యూజిలాండ్ రెండో వన్డే సందర్భంగా రవిశాస్త్రి మాట్లాడుతూ.. "దేశం కోసం అద్భుతంగా ఆడిన ఒక ఆటగాడు ఇలా తప్పుకోవడం విచారకరం. అతనిలో ఇంకా 30 నుంచి 40 టెస్ట్ వికెట్లు తీసే సత్తా ఉందని నేను కచ్చితంగా భావించాను. గత 12 నెలల్లో అతనికి అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఒక టెస్ట్ మ్యాచ్ బౌలర్‌గా అతను జట్టులో ఉండాల్సింది" అని అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను అంచనా వేయడానికి కేవలం జిమ్-ఆధారిత పరీక్షలపై ఆధారపడటాన్ని కూడా శాస్త్రి తప్పుబట్టాడు. "ఒక మ్యాచ్‌లో 10 లేదా 12 ఓవర్లు బౌలింగ్ చేయలేకపోతే జిమ్‌లో ఫిట్‌గా ఉండి ఏం ప్రయోజనం? ఇక్కడ మీకు ఒక వర్క్‌హార్స్ (కష్టపడి పనిచేసే బౌలర్) అందుబాటులో ఉన్నాడు. అతనికి మరో అవకాశం ఇవ్వకపోవడం నన్ను తీవ్రంగా నిరాశపరిచింది" అని శాస్త్రి ఆవేదన వ్యక్తం చేశాడు. షమీ ఫిట్‌నెస్‌పై వస్తున్న నివేదికలను కూడా శాస్త్రి కొట్టిపారేశాడు. "అతను ఫిట్‌గా లేడని కొన్ని పత్రికా కథనాలు నేను చూశాను. కానీ, అతను బెంగాల్ తరఫున అన్ని దేశవాళీ మ్యాచ్‌లూ ఆడాడు.

కీరవాణి ఇంట శుభకార్యం.. ఘనంగా కుమారుడి నిశ్చితార్థం!



టాలీవుడ్‌లో మరోసారి పెళ్లి బాజాలు మోగబోతున్నాయి. ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి కుటుంబంలో శుభకార్యం జరిగింది. ఆయన పెద్ద కుమారుడు, యువ గాయకుడు, సంగీత దర్శకుడు కాలభైరవ వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టేందుకు సిద్ధవ య్యారు. 'బలగం' సినిమాతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరోయిన్ కావ్య కల్యాణ్‌రామ్‌తో ఆయన నిశ్చితార్థం జరిగింది. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుకను నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నిశ్చితార్థ వేడుకకు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, ఆయన భార్య రమా రాజమౌళి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. సం ప్రదాయ దుస్తుల్లో కాలభైరవ, కావ్య ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచారు. ఎంతో ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు బయటకు రావడ ంతో అభిమానులు, సినీ ప్రముఖులు నూతన జం టకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాలభై రవ తన తండ్రి బాటలో సంగీత ప్రపంచ ంలోకి అడుగుపెట్టి గాయకుడిగా, సంగీత దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చుకున్నారు. మరోవైపు కావ్య కల్యాణ్‌రామ్ బాలన టిగా కెరీర్ ప్రారంభించి, 'మసూద', 'బలగం' వంటి చిత్రాలతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ముఖ్యంగా 'బలగం' చిత్రంలోని ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఇరు కుటుంబాల అంగీకారంతో జరగనున్న వీరి వివాహాన్ని డిసెంబర్‌లో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెళ్లి తేదీ, వేదిక వంటి పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కాగా, ఇటీవలే సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ తన ప్రేయసితో నిశ్చితార్థం చేసుకున్నారు. హీరో తేజ సజ్జా కూడా త్వరలో పెళ్లి చేసుకో బోతున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు కాలభైరవ, కావ్యల పెళ్లి వార్తతో టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి నెలకొంది.

22 ఏళ్ల తర్వాత మళ్లీ అదే టైటిల్..

కమల హాసన్ కొత్త చిత్రం 'సండియార్'

లోకనాయకుడు కమల హాసన్ తన తదుపరి చిత్ర శీర్షికను అధికారికంగా ప్రకటించాడు. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి 'సండియార్' అనే పేరును ఖరారు చేశారు. నవంబర్ 7న కమల్ పుట్టినరోజును పురస్కరించుకుని, ఆయన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ శుక్రవారం ఈ ప్రకటన వెలువరించింది. ఈ శీర్షిక వెనుక ఒక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. సుమారు 22 ఏళ్ల క్రితం, అంటే 2004లో కమల్ హాసన్ స్వీయ దర్శకత్వంలో విడుదలైన 'విరుమాండి' చిత్రానికి తొలుత 'సండియార్' అనే పేరునే అనుకున్నారు. అయితే, అప్పట్లో కొన్ని వర్గాల నుంచి తలెత్తిన తీవ్ర వ్యతిరేకత, వివాదాల కారణంగా ఆ టైటిల్‌ను 'విరుమాండి'గా మార్చాల్సి వచ్చింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కమల్ మళ్లీ అదే పేరును తన కొత్త సినిమాకు ఎంపిక చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. చిత్ర బృందం ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఇందులో కమల హాసన్ కారు కిటికీలోంచి రివాల్వర్ పట్టుకుని గంభీరంగా కనిపిస్తున్నాడు. కారు డోర్‌పై ఉన్న రక్తపు మరకలను బట్టి చూస్తుంటే, ఇది ఒక క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ అని స్పష్టమవుతోంది.



'రామాయణం'లో లక్ష్మణుడి పాత్ర.. లుక్ టెస్ట్ వరకు వెళ్లి ఛాన్స్ మిస్సయ్యా: నటుడు కరణ్ జోత్వానీ

ప్రముఖ దర్శకుడు నితేశ్ తివారీ 'రామాయణం' సినిమాలో లక్ష్మణుడి పాత్ర కోసం తాను ఆడిషన్ ఇచ్చానని, తుది దశ వరకు వెళ్లానని ప్రముఖ టీవీ నటుడు కరణ్ జోత్వానీ తాజాగా వెల్లడించాడు. 'బెబాకీ' సీరియల్‌తో గుర్తింపు పొందిన ఆయన, ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర అనుభవాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నాడు. 2022 అక్టోబర్‌లో 'రామాయణం' చిత్ర సెట్‌లో లక్ష్మణుడి పాత్ర కోసం తాను కాస్ట్యూమ్ ట్రయల్ కూడా పూర్తి చేశానని కరణ్ తెలిపాడు. ఆనాటి లుక్ టెస్ట్ ఫొటోను షేర్ చేస్తూ, ఆ అనుభవం తనకో అద్భుత ప్రపంచాన్ని పరిచయం చేసిందని పేర్కొన్నాడు. ఆడిషన్ ప్రక్రియ ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగిందని, ఫలితంతో సంబంధం లేకుండా అంకితభావంతో పనిచేయాలనే నమ్మకాన్ని ఆ చర్చలు తనకు నేర్పాయని రాసుకొచ్చాడు. అయితే, ఈ పాత్ర తనకు దక్కనప్పటికీ, లక్ష్మణుడిగా నటించిన రవి దూబేపై కరణ్ ప్రశంసలు కురిపించాడు. "లక్ష్మణుడి పాత్రకు రవి ప్రాణం పోసిన తీరు అద్భుతమని వింటున్నాను. టీవీ రోజుల్లో నుంచే ఆయనంటే నాకు ఎంతో అభిమానం" అని పేర్కొన్నాడు. ఈ చిత్రంలో రాముడి పాత్ర పోషిస్తున్న రణ్‌బీర్ కపూర్ తన ఫేవరెట్ నటుడని చెబుతూ, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు మొత్తం చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపాడు. 'రామాయణం: పార్ట్ 1' ఈనెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు.



సురేఖ వాణి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ ప్రైవేట్ కంటెంట్ వైరల్ కావడంతో నటి ఆగ్రహం!





ప్రముఖ తెలుగు నటి సురేఖ వాణి సోషల్ మీడియా ఖాతా హ్యాకిం గ్‌కు గురైంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేసిన కొందరు దుండగులు, ఆమెకు సంబంధించిన వ్యక్తిగత కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడంతో ఈ విషయం కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంపై సురేఖ వాణి తీవ్రంగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.తన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయిందని, దీన్ని ఆసరాగా చేసు కుని కొందరు తన ప్రైవేట్ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వ్యూస్, లైక్స్ కోసం బాధ్యతా రహితంగా ప్రవర్తిం చవద్దని మీడియా సంస్థలకు, యూట్యూబ్ ఛానెళ్లకు, మీమ్ పేజీలకు ఆమె సూచించారు. తన వ్యక్తిగత కంటెంట్‌ను షేర్ చేయడం లేదా రీపోస్ట్ చేయడం వెంటనే ఆపేయాలని స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన సున్నితమైన విషయమని, దీన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని సురేఖ వాణి స్పష్టం చేశారు. తన హెచ్చరికలను బేఖాతరు చేసి ఎవరైనా ప్రైవేట్ కంటెంట్‌ను ప్రచారం చేస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు సదరు కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని, తన ప్రైవసీని గౌరవించాలని ఆమె అందరికీ విజ్ఞప్తి చేశారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com